# ధాంధాంధాం

ఆస్కార్ ఎగ్జిక్యూటివ్ బ్రీఫ్‌కేస్ పట్టుకుని స్లీపర్ కోచ్ ఎక్కాడు వృషాకపి. అతను ఒక బడా సేఠ్ జీ తరఫున కలకత్తా వెళ్తున్నాడు. కొత్తపది రూపాయల కట్టలు ఒక ఇరవై ఈజ్ ఈక్వల్ టు ఇరవై వేలు ఆ బ్రీఫ్‌కేస్‌లో ఉన్నాయి. ఆ నోట్ల కట్టల మీద ఓ జత పాలిస్టర్ బట్టలు, ఒక లుంగీ, ఒక తువ్వాలు ఉన్నాయి. టీటీయీ బెర్త్ నెంబరు, టిక్కెట్ నెంబర్ వెరిఫై చేసుకుందుకు వచ్చాడు. అన్నీ సరిపోయినట్టు ధ్రువపరుచుకుని, పక్కాయన టికెట్ చూపించమన్నాడు టిటియీ. పక్కాయన టిక్కెట్ చూపిద్దామని, తల క్రింద పెట్టుకున్న బ్రీఫ్‌కేస్ తెరిచాడు. టిక్కెట్‌ని పెట్టె అడుగున పడేయడం వలన, బట్టలు ఎత్తి, టిక్కెట్ తీశాడా పెద్దమనిషి. వృషాకపి కళ్లు జిగేల్‌మన్నాయి! ఆ పెద్దమనిషిది కూడా ఆస్కార్ బ్రీఫ్‌కేసే! దాంట్లోపల ఐదో, ఆరో వంద రూపాయల కట్టలున్నాయి!

వృషాకపికి మెరుపులాంటి ఐడియా వచ్చింది. తన బ్రీఫ్‌కేస్‌లో ఉన్నవి ఇరవై వేల రూపాయలే. కాని ఎదుటి వ్యక్తి బ్రీఫ్‌కేస్‌లో ఉన్నవి ఐదో, ఆరో వంద రూపాయల కట్టలు - అనగా ఏభై, అరవై వేల రూపాయలు!

వెధవది... డబ్బన్నది ఎలాగైనా పాపిష్టిదే సుమండీ! 'మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః' అని పెద్దలు ఊరికే అన్నారా? తల్లీ కొడుకూ ఒకరికి తెలియకుండా ఒకరు విషాన్నం పెట్టుకుని బాల్చీ తన్నేస్కో లేదా?

రాత్రి తొమ్మిదైంది. అందరూ భోజనాలు చేసి పక్కలు పరుచు

కుంటున్నారు.

రాత్రి ఒంటి గంటయింది. అందరూ నిద్రపోతున్నారు. ఎదురుగా కూర్చున్న వ్యక్తి టాయిలెట్ రూమ్ కెళ్లాడు. ఇదే అదననుకొని, మెల్లగా తన బ్రీఫ్‌కేస్‌ని ఎదుటి వ్యక్తి పక్కన పెట్టేసి, అతని బ్రీఫ్‌కేస్‌ని తన వద్దకు లాక్కున్నాడు వృషాకపి.

భువనేశ్వర్ వచ్చింది. కలకత్తా వెళ్లవలసిన వృషాకపి దర్జాగా బ్రీఫ్‌కేస్ పట్టుకుని భువనేశ్వర్‌లో దిగిపోయాడు.

లీలా శుకుని 'కృష్ణ కర్ణామృతం' అనే భక్తి గ్రంథంలో బాల గోపాలుని లీలా విలాసాలను వర్ణిస్తూ ఓ శ్లోకం ఉంది. బాల కృష్ణుడు ఒక గోపిక ఇంట్లో దూరి బానలో ఉంచిన వెన్నను దొంగతనంగా తింటూంటాడు. అనుకోకుండా ఆ గోపిక, ఈ వెన్న దొంగను చూసేస్తుంది.

"కస్త్వం బాల?- ఎవరబ్బాయివి నువ్వు?" అని అడుగుతుంది గోపిక.

"బలానుజః బలరాముని తమ్ముణ్ణి" అంటాడు బాల కృష్ణుడు.

"కి మిహతే? ఇలా ఎందుకు వచ్చావు?"

"మన్మందిరా శంకయా- మా ఇల్లే అనుకున్నాను" అంటాడు బాల కృష్ణుడు.

ఒకవేళ ఎదుటి వ్యక్తి "అయ్యా! మీరు పట్టుకెళ్తున్నది నా బ్రీఫ్‌కేసండీ!" అని మేల్కొని అంటే - "ఓ అయామ్ సారీ! రెండూ ఒక్కలాగే ఉండడం వల్ల నాదే అనుకున్నాను!" అని బాలకృష్ణుని వలె తప్పించుకుని తిరిగీ ధన్యుడు సుమతి అనిపించు కుందామనుకున్నాడు వృషాకపి. కానీ, అదృష్టవశాత్తూ ఎదుటి వ్యక్తి చూడలేదు.

పూర్వం ఋషులు అరణ్యాలలో ఆశ్రమాలు నిర్మించుకుని చుట్టుప్రక్కల ముని పల్లెలలోని బాలుర చేత వేదాలు, ఉపనిషత్తులు అధ్యయనం చేయిస్తుండేవారు. అలా అరణ్యాలలో బోధించబడినవి గనుక వాటికి 'ఆరణ్యకాలు' అని కూడా పేరువచ్చింది. అందులో బృహదారణ్యక ఉపనిషత్తు ఒకటి. గురువుగారు ఎత్తైన రాతి తిన్నెమీద కూర్చుని 'వేదం' అధ్యయనం చేయించేవారు గనుక ఆ రాతి తిన్నెకి 'వేదిక' అని పేరు వచ్చింది. ఇప్పటికీ సభలు, సమావేశాలు జరుగుతున్నప్పుడు 'వేదిక' మీదకు వచ్చి ప్రసంగాలు చేయమని ఉపన్యాసకుల్ని ఆహ్వానిస్తుంటాము.

ఇలా వేదిక మీద కూర్చుని ఒకనాడు ఒక ఋషి తన శిష్యులకి ఒక పని పురమాయించాడు. ఆ అడవిలో ఉన్న పళ్ళ శిష్యుల చేత కోయించి "ఒరేయ్ అబ్బాయిలూ! మీరు ఒక్కొక్కరూ ఒక్కొక్క పండు తీసుకుని ఎవ్వరూ చూడకుండా తినేసి రావాలి" అని చెప్పాడు. శిష్యులందరూ చెట్టుకొకడు, పుట్టకొకడు అయిపోయి ఎవ్వరూ చూడకుండా పళ్లు తినేసి వచ్చారు. వాళ్లలో ఒక శిష్యుడు మాత్రం తను ఎక్కడికీ వెళ్లకుండా అక్కడే ఉండిపోయాడు. గురువుగారు శిష్యుల్నడిగారు.

"ఏవ్రా! ఎవరూ చూడకుండా మీరంతా పళ్లు తినేసి వచ్చారా?"

"ఓ" అన్నారు శిష్యులు.

ఎటూ వెళ్లకుండా ఉండిపోయిన శిష్యుడు మాత్రం "నేనెక్కడికీ వెళ్ళి పండు తినలేదు గురువు గారూ!" అన్నాడు.

"ఏం ఎంచేత?" అనడిగారు గురువుగారు.

"ఎవ్వరూ చూడకుండా పండు తినమన్నారు మీరు. ఈ సకల విశ్వాన్నీ సృజించిన భగవంతుడు చూడనిదంటూ ఏదీ లేదు. ఆయన చూడకుండా నేను పండు ఎలా తినడం గురువుగారూ?" అన్నాడా శిష్యుడు.

అలాగే మనం చేసిన దొంగ పని ఎవరూ చూడ్డంలేదు- భలేగా ఉందిలే అనుకుంటాము. వృషాకపి కూడా తన బ్రీఫ్‌కేస్‌కి బదులు ఇంకొకరి బ్రీఫ్‌కేస్ పట్టుకుని, ఎవరూ గమనించలేదని సంతోషించాడు.

భువనేశ్వర్‌లో హొటల్ కేసినోలో బసచేశాడు వృషాకపి. రూమ్ తలుపులు బిడాయించి బ్రీఫ్‌కేస్ బ్రద్దలుకొట్టాడు. ఓహ్! ఆరు వంద రూపాయల కట్టలు! అరవై వేలు!!

'టక్ టక్ టక్'

వృషాకపికి చలి కాలమైనా చెమటలు పట్టేశాయి. గబగబా నోట్ల కట్టల్ని పరుపు క్రిందకి తోసేసి తలుపులు తీశాడు.

పోలీసు యమకింకరులు! అన్నీ సోదా చేసి నోట్లు పట్టుకున్నారు.

"ఏయ్ మిస్టర్! మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాము. ఇవి దొంగ కరెన్సీ నోట్లు" అంటూ బేడీలు వేసి తీసుకెళ్ళిపోయారు.

వృషాకపి వదిలేసిన బ్రీఫ్‌కేస్‌లో అరవైవేలు దొంగనోట్లకి బదులు, ఇరవైవేలు

మంచి నోట్లు అందునా అయాచితంగా వచ్చినందుకు సంతోషించాడు అవతలి వ్యక్తి. తను కలకత్తాలో చేద్దామనుకున్న పని త్రోవలోనే ఐపోయింది. అయితే తను కూడా ఎప్పుడో ఒకప్పుడు దొరికిపోక తప్పదు!

డబ్బ్బా పోయి డప్పా వచ్చె ఢాం ఢాం ఢాం!

అర్రవై పోయి ఇర్రవై వచ్చె ఢాం ఢాం ఢాం!!

• ఆంధ్రప్రభ డెయిలీ •

*31–3–1990*